క్లుప్తంగా

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు

నార్పల: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బి.పప్పూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మహేంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం ఆయన హెచ్.సోదనపల్లిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతో విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాటమయ్య, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శి రాయుడు, వైద్యాధికారులు మల్లికార్జున, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, కౌన్సిల్ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

పెద్దపప్పూరు: నరసాపురం గ్రామ సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం తెల్లవారుజామున ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ పట్టుకున్నారు. సుంకేసులపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త నరేష్‌తోపాటు నరసాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి: బస్టాండ్ ఆవరణలో శనివారం మహిళా మట్కాబీటర్‌ను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు గన్నెవారిపల్లి కాలనీకి చెందిన దాస్తి సరస్వతి అనే మహిళ తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో మట్కా నిర్వహిస్తుండగా తమ సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె నుంచి మట్కా పట్టీలతో పాటు, సెల్‌ఫోన్, రూ.4,010 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు నిమిత్తం పట్టణ పోలీసులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

థ్యాంక్యూ సీఎం సార్


గుంతకల్లుటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా తన సోదరుడు వై.సీతారామిరెడ్డిని నియమించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లారెడ్డి కుటుంబ పట్ల నమ్మకం ఉంచి కలియుగదైవమైనవేంకటేశ్వరస్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం కల్పించినందుకుగానూ జగనన్నకు రుణపడి ఉంటామని ఎమ్మెల్యే శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీటీడీ బోర్డు సభ్యుల నియామకంలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చోటు కల్పించి సామాజిక న్యాయాన్ని పాటించిన జగనన్న బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు... యాడికి మండలం రాయలచెరువుకు చెందిన శ్రీనివాసులు పని మీద బైక్‌లో గుత్తి ఆర్ఎస్‌కు వచ్చి తిరిగి స్వగ్రామం బయలుదేరాడు. తాడిపత్రి రోడ్డులోని కుంట వద్ద బైక్ అదుపు తప్పికిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పామిడి: ఎద్దులపల్లి గ్రామ సమీపాన శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండా వాసి దేవేంద్రనాయక్ రక్తగాయాల పాలయ్యాడు. రోడ్డుకు అడ్డంగా దున్నపోతు రావడంతో ఘటన జరిగింది. క్షతగాత్రుడిని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయండి



మోటార్ల పనితీరుపై ఆరా తీస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వాటర్ వర్క్స్ సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం పట్టణంలోని తిమ్మనచెర్ల పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును ఆయన పరిశీలించారు. పంపింగ్ మోటార్ల పనితీరుపై అక్కడున్న సిబ్బందిని ఆరాతీశారు. శివారు కాలనీ ప్రజలకు సకాలంలో వాటర్ ట్యాంకులను పంపి నీటి సమస్యల్లేకుండా చూడాలన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- పాదయాత్రకు అడుగడుగునా నీరాజనాలు

యాడికి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రజా సంక్షేమయాత్రలో భాగంగా 5వ రోజు నగరూరు, భోగాలకట్ట, తూట్రాళ్లపల్లె, రామారిజుపల్లె, రాయలచెరువులో సాగింది. యాత్ర నగరూరు నుంచి భోగాలకట్టకు పోయే రహదారిలో బెండ కాయలు కోస్తున్న వ్యవసాయ కూలీలతో ఎమ్మెల్యే మాట్లాడారు. భోగాలకట్టకు చేరుకోగానే ఎంపీటీసీ సభ్యురాలు వెన్నపూస నాగరాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే గ్రామంలోని వీధుల వెంట యాత్ర కొనసాగిస్తూ ప్రజలను పేరు పేరునా ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి ఇంటి వద్ద అల్పాహారంలో ఏర్పాటు చేశారు. అనంతరం యాత్ర తూట్రాళ్లపల్లెకు చేరుకోగా సర్పంచు సంజీవరాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్న, పొదుపు మహిళలు ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం కూర్మాజీ పేట, రాయలచెరువుకు చేరుకోగా గ్రామ సర్పంచు తలారి అరుణ, వైస్ ఎంపీపీ హసీనా భేగం, వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి నాగేష్, రషీద్, జగదీష్ చౌదరి, శివయ్య, రవికాంత్ , ఎస్సీ కాలనీ వాసులు, తాడిపత్రి ముస్లిం మైనార్టీ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం యాత్ర ఉన్నత పాఠశాల వైపు సాగింది. రాయలచెరువు బస్టాండు నుంచి చందన గేట్ వరకు ఎమ్మెల్యేపై పూలవర్షం కురిపించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్, వైస్ చైర్మన్ హరినాథరెడ్డి, ఓబుళరెడ్డి, పెద్దవడుగూరు వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, ఉప సర్పంచులు కాసా చంద్రమోహన్, ప్రవీణ్‌కుమార్ యాదవ్, నాయకులు శ్రీరామరెడ్డి, భాస్కర్ రెడ్డి హనుమంతరెడ్డి, చలమా రెడ్డి, చిన్న కంబగిరి రెడ్డి నాగిరెడ్డి , ముత్యాల రెడ్డి, సుబ్బయ్య, డీలర్ మల్లికార్జున రంగ, ఉపేంద్ర గౌడు తదితరులు పాల్గొన్నారు.



భోగాలకట్ట వద్ద కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సత్కరిస్తున్న తాడిపత్రి ముస్లిం మైనార్టీ నాయకులు

సంక్షేమ యాత్రకు సంఘీభావం

ప్రజా సంక్షేమ పాదయాత్ర కూర్మాజిపేట గ్రామ శివారులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే చేపడుతున్న ప్రజా సంక్షేమయాత్ర యాడికి మండలం ప్రజల గుండెల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతోందని పైలా పేర్కొన్నారు. ప్రజలకు అన్ని వేళలా అండగా ఉండే ఎమ్మెల్యేనే అన్న నమ్మకాన్ని యాత్ర ద్వారా నిరూపిస్తున్నారన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



శాశ్వత భూహక్కు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల : దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష కార్యక్రమం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం నిదనవాడ గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్షణ పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూములపై శాశ్వత హక్కులు కల్పించేందుకు భూసర్వే చేపడుతోందన్నారు. బ్రిటిష్ కాలం నాటి డైగ్లాట్ అనుసరించే భూములున్నాయని, దీంతో భూసమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. రైతుల భూసమస్యలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి , వాటి సమస్యలను పరిష్కరించి, శాశ్వత హక్కులు కల్పించాలని నిర్ణయించారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో భూముల సర్వే జరుగుతోందన్నారు. రైతులకు సంబంధించిన భూములను రెవెన్యూ అధికారులు సక్రమంగా కొలతలు వేసి, వారి భూములు , వారి పేర్లు మీదుగా నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, డీసీఎంఎస్ డైరెక్టర్ డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపీటీసీ సునీత, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలా కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చెన్నకేశవులు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్వీ నారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

సేవకు మానవత్వమే అర్హత

గుంతకల్లు: సేవ చేసేందుకు మానవత్వమ అర్హత అని మదర్‌థెరిసా చాటిచెప్పారని ఆర్‌డీఓ రవీంద్ర పేర్కొన్నారు. స్థానిక టీవీ టవర్ సమీపంలోని మదర్‌థెరిసా విగ్రహం ఎదుట శనివారం జనవిజ్ఞాన వేదిక నాయకులు మదర్‌థెరిసా 114వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆర్‌డీఓ మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా కష్టాల్లో ఉంటే వారిని ఆదుకోవాలని, సేవకు ఎల్లలు లేవని మదర్‌థెరిసా నిరూపించారన్నారు. ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని చేతల్లో చూపించారన్నారు. పేదరికం, ఆకలి, దుస్థితి వంటివి దేశానికి ప్రమాదకరమని భావించి నిర్మల్ హృదయ్ ఆశ్రమాలను ఏర్పాటుచేసి ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సమాజంలో విశిష్ట సేవలందించిన పలువురిని ఆర్‌డీఓ సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్ యాదవ్, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాజు, జేవీవీ నాయకులు రాధాకృష్ణ, వీ.సుధాకర్, శివప్రియ, వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీఓ రవీంద్ర

సంక్షిప్త సమాచారం

దుర్గాంజనేయుడికి ప్రత్యేక పూజలు

శింగనమల: స్థానిక చెరువు కట్ట వద్ద నున్న దుర్గాంజనేయ స్వామికి శనివారం తేనెతో అభిషేకం చేశారు. శ్రావణ శనివారం పురస్కరించుకొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతపురం, శింగనమల, కొర్రపాడు, గార్లదిన్నె నుంచి భక్తులు తరలివచ్చారు.

10 మందిపై కేసు నమోదు

గుత్తి: పట్టణంలోని దాసరి కాలనీ ఇంటి స్థలం విషయంపై జరిగిన ఘర్షణలో శనివారం 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరు వర్గాలకు చెందిన రవి, సుజాత, నీలమ్మ, వెంకటరాముడు, పెద్ద వెంకటేష్, అశోక్, కృష్ణవేణి, సాయి కీర్తన, శ్రీనివాసులు, వసంతపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు సన్మానం

గుత్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన నిర్మలారెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ విశాలాక్షి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి , రాము తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర జయప్రదం చేయండి

తాడిపత్రి: సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన బస్సుయాత్ర వచ్చే నెల 4 నుంచి 8 వరకూ జిల్లాలో కొనసాగుతుందని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం సీపీఐ నాయకులతో కలసి బస్సు యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రభుత్వ ఆస్తులను ప్రయివేట్ పరం చేస్తోందన్నారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కార్యదర్శి నాగరంగయ్య తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఆంజనేయ, నాగుల విగ్రహ ప్రతిష్ట

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచముఖ ఆంజనేయ స్వామి, శివయ్య, నాగుల విగ్రహాలు, నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపించారు.

వర్షం కోసం తిమ్మప్ప స్వామికి పూజలు

గుత్తి రూరల్: కొజ్జేపల్లి గ్రామస్తులు వర్షం కోసం శనివారం తిమ్మప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను తలపై ఉంచుకొని గ్రామం నుంచి ఊరేగింపుగా లచ్చానుపల్లి వద్ద ఉన్న తిమ్మప్ప స్వామి కొండ వరకూ వెళ్లారు. అనంతరం తిమ్మప్ప స్వామికి బోనాలను సమర్పించి, గ్రామంలోని బొడ్రాయికి 101 బిందెలతో అభిషేకం నిర్వహించారు.

కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మంజుల

గుంతకల్లుటౌన్: వచ్చే నెల 9వ తేదీన స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి జి.మంజుల పోలీసు అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం కోర్టు హాల్‌లో లోక్‌అదాలత్ నిర్వహణపై జడ్జి మంజుల కోర్టు సిబ్బంది, లోక్‌అదాలత్ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో సీఐలు రామసుబ్బయ్య, మహేశ్వరరెడ్డి, ఎస్ఐలు గోపాలుడు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలి

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదవుతో పాటు వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. శనివారం రెడ్డిపల్లి కేవీకేను అనంతపురానికిచెందిన 8,9,10వ తరగతి, ఇంటర్‌మీడియట్ విద్యార్థులు సందర్శించారు. ముందుగా కేవీకేలో చేపడుతున్న కార్యక్రమాలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి వివరించారు. కేవీకేలో మట్టి నమూనాల కేంద్రం, సీడ్ ప్రాసెసింగ్ సెంటర్, షేడ్‌నెట్ అజోల్ల, సమాచార కేంద్రం, వర్మీ కంపోస్ట్, పశువులు, గొర్రెల పెంపకం, వివిధ రకాల పంటల సాగుపై వివరించారు. రైతులకు పంటల సాగుపై నిత్యం సమాచారం అందిస్తూ శాస్త్రవేత్తలు పని చేస్తుంటారని తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే పశు పోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన, భూసార పరీక్ష కేంద్రం అధికారి ముత్యాల రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భూసార పరీక్షలపై తెలుసుకుంటున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఎస్ఐపీలో ప్రతిభ కనబరచండి

గుంతకల్లుటౌన్: ఈ నెల 28 నుంచి 30 వరకు విజయవాడలో యూనిసెఫ్ నిర్వహిస్తున్న స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్–2023లో అద్భుతమైన ప్రదర్శన ద్వారా తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా సైన్సు అధికారి యు.బాలమురళీ తెలిపారు. శనివారం స్థానిక రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. రాష్ట్రస్థాయి ఎస్ఐపీకి ఎంపిక కావడానికి అద్భుతమైన ప్రాజెక్టులను తయారు చేయించిన స్కూల్ సైన్స్ టీచర్ టి.తాజున్‌బీతో పాటు 9వ తరగతి విద్యార్థులు రోషన్, సుదర్శన్, రంజిత్‌కుమార్, అమీర్, యశ్వంత్‌ను డీఎస్ఓ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిసెఫ్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్ఐపీలో గుంతకల్లు రాజేంద్రప్రసాద్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన ఆరు ప్రాజెక్టుల్లో రసాయన విభాగం ప్రాజెక్టు ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్ఓ బాలమురళీ

పత్తిలో పచ్చదోమ నివారణపై దృష్టి పెట్టాలి


పెద్దవడుగూరు: పత్తి పంట సాగు చేసిన రైతులు పచ్చదోమ నివారణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ మల్లీశ్వరి సూచించారు. శనివారం మిడుతూరు, పెద్దవడుగూరు గ్రామాల్లోని పత్తి పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం పత్తికి పచ్చదోమ అధికంగా సోకే అవకాశం ఉందని, నివారణకు ఫ్లోనికామిడ్ 0.4 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా డై ఫెంథురాన్ 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తామర పురుగు నివారణ కు థయోమెథాక్సిమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి లేదా స్పినెటోరమ్ 1మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రజిని, కైలాస్ , రైతులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



మిడుతూరులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకట్రాముడు

చంద్రబాబు, లోకేష్‌పై చర్యలు తీసుకోండి

గార్లదిన్నె: యువగళం పాదయాత్రలో కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నేత నారా లోకేష్, శాంతిభద్రలకు విఘాతం కలిగేలా ప్రసంగాలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు కోరారు. ఈమేరకు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ శంకర్ రెడ్డికి ఫిర్యాదు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ గంగాధర్, కో కన్వీనర్లు అమరనాథ్‌రెడ్డి, చిన్నరాముడు, పిల్లల శ్రీనివాసులు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్ఐకు ఫిర్యాదు అందిస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

పంటకోత ప్రయోగాలపై అవగాహన అవసరం

గుంతకల్లు రూరల్: పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రాము, ఏఓ స్వాతి సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ఆధారంగానే దేశ స్థూల, జాతీయ ఉత్పత్తి ఆధారపడి ఉంటుందన్నారు. పంటకోత ప్రయోగాలను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, తదితర పంటలను సాగయ్యాయని తెలిపారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

పెద్దవడుగూరు: జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్, సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఓబిరెడ్డి, ఆదినారాయణ కోరారు. శనివారం ఏ.తిమ్మాపురంలో ఎండి పోతున్న పంట పొలాలను పరిశీలించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నాయకులు అల్లాబకాష, నారాయణస్వామి, రంగస్వామి, శేషోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

పామిడి: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాల సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పంప్ హౌస్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా కార్మికులు కృష్ణకాంత్, జోసఫ్, ప్రసాద్ మాట్లాడుతూ 5 నెలలుగా తమకు వేతనాలు ఇవ్వలేదన్నారు.

నిష్పక్షపాతంగా ఓటరు జాబితా సవరణ



సలకంచెరువులో ఓటరు జాబితా పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ ఓబులమ్మ

శింగనమల: నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు డీఎల్‌డీఓ, నియోజకవర్గ ఓటరు వెరిఫికేషన్ అధికారి ఓబులమ్మ తెలిపారు. శనివారం సలకంచెరువులో ఓటరు వెరిఫికేషన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా డబుల్ ఎంట్రీ, తొలగించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి విచారించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రజిత, వీఆర్వో నాగేంద్ర, బీఎల్‌ఓలు జయశ్రీ పాల్గొన్నారు.

యువరైతు ఆత్మహత్య



రాజేంద్రప్రసాద్ (ఫైల్)

పుట్లూరు: రెండేళ్లుగా పత్తి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన ఓ యువరైతు అప్పులను తీర్చే మార్గం లేదని భావించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కందికాపుల గ్రామానికి చెందిన తలారి నరసింహులు, లక్ష్మీనరసమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. వీరిలో మగ్గురు కుమార్తెలు, పెద్ద కుమారుడికి వివాహం కాగా చిన్న కుమారుడైన రాజేంద్రప్రసాద్(23) తమకున్న ఎనిమిది ఎకరాల్లో పత్తి పంటను రెండేళ్లుగా సాగు చేశాడు. అయితే పత్తి పంట దిగుబడి తగ్గిపోవడంతో రూ.3 లక్షల మేరకు నష్టపోయాడు. అప్పులను తీర్చే మార్గం లేదని, అప్పులు ఉంటే తనకు వివాహం కాదని ఆందోళన చెంది శుక్రవారం రాత్రి పొలం వద్దకు వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి తలారి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

సమ్మెలో సత్యసాయి కార్మికులు

గార్లదిన్నె: కల్లూరు సత్యసాయి వాటర్ సప్లయ్‌లో పనిచేసే కార్మికులు శనివారం రెండవ రోజు సమ్మె చేశారు. ఈసందర్భంగా సత్యసాయి కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించకపోవడంతో సమ్మె చేస్తున్నామన్నారు. కార్మికులు నాగభూష ణం, బాషా,మల్లరాయుడు, శ్రీనివాసులు, నాగరాజు, నాగవర్ధన ,నాగేశ్వరరావు ,సాంబశివ, జానారెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

కళ్లద్దాల పంపిణీ

పెద్దపప్పూరు: స్థానిక తాడిపత్రి డివిజన్ కంటి వైద్య నిపుణుడు మధుసూదన్ రాజు ఆధ్వర్యంలో శనివారం 190 మంది వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు పథకం వృద్ధులకు వరంలాంటిదన్నారు. 50 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు ఆపరేషన్ చేసి కంటి అద్దాలు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్, సచివాలయాల తనిఖీ

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 10,11 వార్డు సచివాలయాలతో పాటు చెర్నేపల్లిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందితో ఆరా తీశారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యే వైవీఆర్‌ను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను కలిసి పూలమాలు, శాలవతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల గుంతకల్లులో లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే పరిస్థితి ఉండేది. గత పాలకులు పాలిటెక్నిక్ కళాశాల విషయాన్ని అస్సలు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసి విద్యార్థులకు బాసటగా నిలిచారని కొనియాడారు.